క్లుప్తంగా

ప్రణాళికలు సిద్ధం చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న నోడలాఫీసర్ మూర్తి, అధికారులు

పుట్టపర్తి అర్బన్: వికసిత్ ఏపీ–2047 లక్ష్యంగా పుట్టపర్తి పట్టణం, రూరల్ మండలం అభివృద్ధికి ప్రతి శాఖ తమ ప్రణాళికలను సిద్ధం చేయాలని నోడలాఫీసర్, పబ్లిక్ హెల్త్ ఈఈ మూర్తి, డీఎస్‌ఓ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికసిత్ ఏపీ లక్ష్యంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయనుందన్నారు. వారం లోపు అభివృద్ధిపై పూర్తి వివరాలను అందజేస్తే వాటిని కలెక్టర్‌కు పంపనున్నట్లు చెప్పారు. ఐదేళ్ల కాలానికి అవసరమైన పనులను గుర్తించాలని, అభివృద్ధి దిశగా పయనించడానికి అవసరమైన వాటిని నివేదికలో చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఏఎస్‌ఓ గంగాధర్, డీటీ నరసింహులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కదిరి అర్బన్: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

15లోగా ఈ-క్రాప్ చేయించుకోవాలి



పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

తలుపుల: ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు సెప్టెంబరు 15లోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ సత్యనారాయణ సూచించారు. తలుపుల-3 రైతుసేవా కేంద్రం పరిధిలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఏఓ షాదాబ్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ నిహారిక, రైతులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్

కదిరి అర్బన్: ఆస్పత్రి అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఆశా కార్యకర్తలతో సంబంధం లేని పనులు చేయించిన అధికారులను సస్పెండ్ చేయాలని ఆస్పత్రి పరిశీలనకు వచ్చిన సెంట్రల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్ కమిటీ సభ్యులైన డాక్టర్ అగస్టీన్ జోసెఫ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగేంద్రనాయక్‌లకు వారు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాంబశివ, జగన్మోహన్, ముస్తాక్, బాబ్జాన్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు



ధర్మవరం రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ధర్మపురి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. రెండు రోజుల పాటు గ్రామంలో స్వామివారిని ప్రతిష్ఠించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి కమిటీ అధ్యక్షుడు నటరాజు, సభ్యులు నాగేంద్ర, చలపతి, బాబు, ధన, శివరామరాజు, జీవన్, రావణ్, భాస్కర్, ఎం.నరసింహరాజు, చంద్రశేఖర్, హరిక్రిష్ణ, రాజు, లీలావతి, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మూడో రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం శ్రీ కృష్ణ పరమాత్ముడి విగ్రహాన్ని పూల పల్లకీలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూల పల్లకీని భుజాలపై మోశారు. ఊరేగింపుకు ముందు శ్రీకృష్ణుడిని కొలువుదీర్చిన మంటపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నిందితుల ఫొటోలు బహిర్గతం చేయాలి



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం జరగడం బాధాకరం. సభ్యసమాజం తలదించుకునే ఇలాంటి ఘటనలు పునరావృతం కారాదు. నిందితుల ఫొటోలు బహిర్గతం చేయాలి. నిందితులను బహిరంగంగా శిక్షించాలి. అలాగే వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ పావని, ధర్మవరం

రాత్రి విధులంటే భయమేస్తోంది



కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారం మానవాళి సిగ్గుతో తలదించుకునే ఘటన. ఇంతటి అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వం కూడా ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చి ఆస్పత్రుల వద్ద నిరంతరం నిఘా ఉండేలా పోలీసు బందోబస్తుతో పాటు వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ జయశ్రీ, ధర్మవరం

కరెంటు కష్టాలకు చెక్

- గత ప్రభుత్వంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు
- సాఫీగా వ్యవసాయ విద్యుత్ సరఫరా
- గణనీయంగా పెరిగిన పంటల సాగు విస్తీర్ణం



మలమీదపల్లి వద్ద సాగు చేసిన వేరుశనగ పంట

గాండ్లపెంట: ఆ గ్రామాల్లో తరచూ అధిక లోడుతో లో ఓల్టేజీ సమస్య ఉత్పన్నమయ్యేది. పెట్టిన పంటలకు సకాలంలో నీరందక ఎండుముఖం పట్టేవి. పెట్టుబడులు సైతం తిరిగి రాక అప్పుల్లో కూరుకుపోయేవారు. ఈ కష్టాలన్నీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీరిపోయాయి. మలమీదపల్లిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుతో మేకలచెరువు, మలమీదపల్లి, రాశినేపల్లి, చామచేనుబైలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీరాయి. ఇదివరకు గాండ్లపెంట సబ్‌స్టేషన్ నుంచి నాలుగు గ్రామాలకూ ఒకే ఫీడర్ ద్వారా గృహావసరాలు, వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా అయ్యేది. అప్పుడు తరచూ లో ఓల్టేజీ సమస్య ఏర్పడేది. వ్యవసాయానికి అంతరాయం లేని విద్యుత్ అందాలంటే నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటే పరిష్కారమార్గమని అధికారులు భావించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయితే తర్వాత స్థల సమస్య వచ్చింది. మలమీదపల్లి రైతు ముబారక్ ఎకరా భూమి ఇచ్చేందుకు ముందుకు రావడంతో సమస్య కొలిక్కి వచ్చింది. అధికారులు ఈ మేరకు రైతు నుంచి భూమి సేకరించి.. రూ.2 కోట్ల వ్యయంతో 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏడాదిలోపే పనులు పూర్తి చేసేశారు. ఇక అప్పటి నుంచి వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు తొలగిపోయాయి. రైతులు కూడా వేరుశనగ, టమాట తదితర పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించారు. నాలుగుగ్రామాల పరిధిలో 450 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. లో ఓల్టేజీ సమస్య ఉన్నపుడు బోరు బావుల కింద ఒక్కొక్కరు ఎకరం నుంచి ఎకరన్నర లోపే పంటలు పెట్టుకునే వారు. ఇప్పుడు విద్యుత్ సమస్య తీరడంతో రెండు నుంచి నాలుగు అంతకు మించి విస్తీర్ణంలో పంటలు పెడుతున్నారు. అంతేకాదు గ్రాసం పెంపకం చేపట్టి పాడి పరిశ్రమనూ విస్తరించారు.



మలమీదపల్లిలో ఏర్పాటు చేసిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

సాగు విస్తీర్ణం పెంచాను



సబ్‌స్టేషన్ ఏర్పాటు కాకముందు ఎకరా లేదా రెండు ఎకరాల్లో పంటలు సాగు చేసేవాడిని. అప్పట్లో విద్యుత్ సక్రమంగా సరఫరా లేక పెట్టిన వేరుశనగ పంట చేతికి రాక పెట్టుబడులు సైతం నష్టపోయా. ప్రస్తుతం నాకున్న 8 ఎకరాల్లోనూ వేరుశనగ, వరి, టమాట పంటలతో పాటు పండ్ల తోటల పెంపకం చేస్తున్నా. వ్యవసాయానికి 7 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

– పూలకుంట వెంకటరమణ, రైతు, మలమీదపల్లి

నాణ్యమైన విద్యుత్ సరఫరా



మలమీదపల్లి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయకముందు గాండ్లపెంట సబ్ స్టేషన్ నుంచి 260 యాంప్‌లు మలమీదపల్లికి ఒకే ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగేది. దీంతో మధ్యలో జంపర్‌లు తెగిపోవడం, మోటార్లు కాలిపోవడం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడేది. ప్రస్తుతం మలమీదపల్లి సబ్ స్టేషన్ నుంచి 4 ఫీడర్లు ఏర్పాటు చేసి మలమీదపల్లి-50, రాశినేపల్లి-80, చామచేనుబైలు-80, మేకలచెరువు-60 యాంప్‌ల చొప్పున నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

– సుబ్రమణ్యం, ట్రాన్స్‌కో ఏడీ

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అంజినప్ప

ఎన్పీకుంట: గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ అంజినప్ప కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మనోహర్ ఆధ్వర్యంలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ -2047 కార్యక్రమంపై బుధవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు విధినిర్వహణలో అలసత్వం వహించరాదని తెలిపారు. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణను పర్యవేక్షించాలని, సకాలంలో వాటిని శుభ్రపరచాలని తెలిపారు. పంచాయతీలలో అభివృద్ధి అవకాశం ఉన్న రంగాలను గుర్తించి ఐదేళ్ల కాలానికి గాను ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మనోహర్, సహాయ గణాంక అధికారి గంగాద్రి, మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్, వ్యవసాయాధికారి లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ గోపాల్‌నాయక్, వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

పుట్టపర్తి రూరల్: ఎనుములపల్లిలో పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. కాకినాడకు చెందిన వేద పండితుల బృందం రెండు రోజులపాటు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. రెండోరోజు బుధవారం లక్ష్మీనరసింహస్వామి విగ్రహాలను అలంకరించి ప్రతిష్ఠించారు. అనంతరం అభిషేకాలు చేశారు. కర్ణాటకలో తయారు చేయించిన 18 అడుగుల ఎత్తు గల ధ్వజస్తంభాన్ని క్రేన్ సహాయంతో వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. చెరువు సాంబశివారెడ్డి, పాపమ్మ దంపతులు రూ.రెండు లక్షలకు పైగా వ్యయం చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితులు సూర్యనారాయణశర్మ, లక్ష్మణ్‌కుమార్, చంద్రశేఖర్‌రావ్, రామ్మోహన్‌రా, భక్తులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక ఏర్పాటు చేయండి

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో హిందూ శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అనాథ శవం పేరిట దిష్టిబొమ్మతో నిరసన చేపట్టారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ శ్మశాన వాటిక లేకపోవడంతో ముదిగుబ్బ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు.

కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు హోమాలు, పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకుని దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలి



సంస్మరణ సభలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నల్లమాడ: స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నల్లమాడలోని బస్టాండ్ కూడలిలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ 2002లో పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా చేపట్టిన ఆందోళనలో ఉద్యమకారులపైకి ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి కాల్పులు జరిపించి, పలువురి మరణానికి కారణమైందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, చిరుద్యోగులపై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని, ఇంధన ధరలు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ మాజీ సభ్యుడు సి.రామకృష్ణ, మండల కార్యదర్శి గోవిందు, సాయికుమార్, మారుతి, ఆంజనేయులు, రంగనాయకులు, సత్యనారాయణ, నారాయణస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

'కులం పేరుతో దూషించి దాడి చేశారు'



చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చెన్నేకొత్తపల్లి: ఇటీవల స్కూల్ కమిటీ డబ్బు విషయమై ప్రశ్నించినందుకు చైర్మన్ రామలింగప్ప, అతని కుటుంబ సభ్యులతో పాటు మరికొందరు తమను కులం పేరుతో దూషించడమే కాకుండా ఇంటి వద్దకు వచ్చి దాడి చేశారని వెంకటంపల్లి ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) వైస్ చైర్‌పర్సన్ ఇందిర వాపోయారు. తన భర్త రాజుపై దాడి చేయడంతో తలకు గాయమైందని, తనను కూడా మెడపై గట్టిగా కొట్టారని తెలిపారు. కాళ్లావేళ్లా పడి వేడుకున్నా వదలకుండా దాడి చేశారన్నారు. వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ బుధవారం ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, గ్రామస్తులతో కలసి బాధితులు చెన్నేకొత్తపల్లి పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిందితులను అరెస్టు చేసి.. తగిన న్యాయం చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



బద్దలాపురంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కనగానపల్లి: రాజకీయ, వర్గకక్షలతో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిసే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని బద్దలాపురం గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ధర్మవరం డీఎస్పీ ఆధ్వర్యంలో రామగిరి సీఐ శివాంజనేయులు, కనగానపల్లి, రామగిరి సర్కిల్ పోలీసులతో కలసి గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా అనుమానస్పదంగా ఉన్న వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. రికార్డులు సరిగా లేకుండా తిరుగుతున్న 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అక్రమ మద్యం విక్రయాలపై ఆరా తీశారు. గ్రామంలో ఉన్న రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ వైషమ్యాలతో గొడవలు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యా సామగ్రి అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం చింతలయ్యగారిపల్లిలోని 30 మంది విద్యార్థులకు ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి బుధవారం విద్యాసామగ్రి వితరణ చేశారు. తన తండ్రి శంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం పుస్తకాలు, డైరీలు, పెన్నులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబులేసు పాల్గొన్నారు.

ఏడో రోజూ నిరసన హోరు



దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ముదిగుబ్బ: వేతనాల కోసం సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన నిరసన ఏడో రోజు బుధవారం కూడా ముదిగుబ్బలో కొనసాగింది. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని దున్నపోతుకు ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు గోపాల్ నాయక్, రాజు, గోపాల్‌రెడ్డి, చంద్ర, రమేష్, కృష్ణానాయక్, మల్లికార్జున, వీరభద్రయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పాఠశాలల్లో నిర్మించిన మరుగుదొడ్లపై దృష్టి సారించాలని మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసూన్‌కుమార్ నాయుడు సూచించారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి వాటి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. వాటిని ఏ విధంగా చేయాలి అనే విషయంపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఉపాధి హామీ పనులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఉపాధి హామీ కింద చేపట్టాల్సిన పనుల గుర్తింపులో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఎంపీడీఓ హెచ్చరించారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడికి పరామర్శ

తలుపుల: అనారోగ్యం బారినపడి అనంతపురంలోని సవీర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎన్పీకుంట సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జగదీశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పూల శ్రీనివాసరెడ్డితో పాటు ఎన్పీ కుంట వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలకృష్ణ నాయుడు ఉన్నారు.

సబ్సిడీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఆయా గ్రామ పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 80 శాతం సబ్సిడీతో ఉలవలు, అలసందలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉలవలు 10 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.870 కాగా.. సబ్సిడీ పోనూ రూ.174 చెల్లించాలన్నారు. అలాగే 8 కేజీల ప్యాకెట్ అలసందలు పూర్తి ధర రూ.904 కాగా సబ్సిడీ పోనూ రూ.181 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, రైతు వాటా మొత్తంతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి



చెర్లోపల్లిలో 'పొలంబడి' నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది

అమడగూరు: సాగు సమయంలో ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయడం వలన అధిక దిగుబడి సాధ్యమవుతుందని వ్యవసాయాధికారి (ఏఓ) వెంకటరమణాచారి పేర్కొన్నారు. బుధవారం కస్సముద్రం పంచాయతీలోని చెర్లోపల్లిలో వేరుశనగ పొలంలో 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. రైతులనుద్దేశించి ఏఓ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పెంచడం, ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను పెంచడం, అవసరం మేరకే రసాయన మందుల వాడకం, పండించిన ఉత్పత్తులకు (ఇండిగ్యాప్ సర్టిఫికెట్) అధిక ధరలతో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం వంటివాటిపై సలహాలను తెలియజేశారు. ముఖ్యంగా విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా ఆకుముడత, పొగాకు లద్దెపురుగు, తిక్క ఆకు మచ్చతెగులు సోకవన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హే..కృష్ణా ముకుందా మురారి



శ్రీ కృష్ణుని ప్రతిమ ఊరేగింపు

ముదిగుబ్బ: మద్దన్నగారిపల్లిలో బుధవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగించారు. రెండు రోజుల పాటు గ్రామంలో కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని పల్లకీలో ఊరేగించారు. శ్రీకృష్ణ నామ స్మరణతో పరిసర ప్రాంతాలు ప్రతిధ్వనించాయి.

ముదిగుబ్బ రూరల్ సీఐగా శ్యామరావు



ముదిగుబ్బ: ముదిగుబ్బ రూరల్ సీఐగా శ్యామరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా వీఆర్‌లో ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న సీఐ కృష్ణంరాజునాయక్ ఒంటిమిట్టకు బదిలీపై వెళ్లారు. సీఐ శ్యామరావు మాట్లాడుతు ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడతామన్నారు.

మధ్యాహ్న భోజన నాణ్యతపై సంతృప్తి

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను ఎస్టీ మానిటరింగ్ కమిటీ కదిరి డివిజన్ సభ్యుడు రాంప్రసాద్‌నాయక్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనం రుచి, నాణ్యత చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

గాండ్లపెంట: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వికసిత్ ఏపీ కార్యక్రమంపై మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు నోడల్ అధికారి మోసెస్ అబ్దుల్‌ఖయ్యూం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. 2024–25 నుంచి 2028–29 వరకు సంబంధించిన ప్రణాళిక తయారీపై అవగాహన కల్పించారు. గతంలో అధికారులకు ఇచ్చిన కార్యచరణ మేరకు గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామానాయక్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీఐ, తహసీల్దార్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



సీఐ సునీతకు సత్యసాయి చిత్రపటం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి టౌన్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పుట్టపర్తి తహసీల్దార్ అనుపమ, అర్బన్ సీఐ సునీతను ప్రజాప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, సూర్యాగౌడ్, పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు లింగాల భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కేశప్ప తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి.. సత్యసాయిబాబా చిత్రపటాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు.